ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.
- సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర నూతన డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా తెలిపారు.
- రాష్ట్రంలో త్వరలో డీఎస్సీ (DSC) నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త మార్కెట్ విలువలు రేపటి నుంచి అమల్లోకి రానున్నాయి.

==================

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పెనుగొండ శ్రీ వాసవీమాతా అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీవాసవీమాత అమ్మవారు అహింస, ఆత్మత్యాగం, శాంతి, ధర్మనిరతికి ప్రతిరూపమని పేర్కొన్నారు. అమ్మవారిని నిత్యం కొలిచే ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్..38 సెకన్లు) - సెట్

==================

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ (DSC) నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈరోజు మంగళగిరిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ ప్రక్రియ చేపడతామన్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ‘ట్రాన్స్‌ఫర్ యాక్ట్’ తీసుకొస్తున్నామని తెలిపారు. ‘‘ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరుపుతున్నామని, ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ నివారణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకువస్తున్నామని అని మంత్రి తెలియజేశారు.

==================

రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త మార్కెట్ విలువలు రేపటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రాతిపదికన వీటిని పెంచినప్పటికీ, కొన్నిచోట్ల తగ్గించారు. కొత్త మార్కెట్ విలువల అమలుకు ఏర్పాట్లు చేసుకోవాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ప్రభుత్వం ఈ మేరకు ఆదేశించింది. భూములతో పాటు నిర్మాణాల విలువల పెంపు కూడా అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపించింది.

==================

తిరుమలలో రథసప్తమి నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈరోజు అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రథసప్తమిని పురస్కరించుకుని పలు ఆర్జిత సేవలను ఏకాంతంగా నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆరోజు అన్ని ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు తిరుపతిలో సర్వదర్శన టోకన్లు జారీ నిలిపి వేస్తున్నట్టు వివరించారు.

(వాయిస్..27 సెకన్లు)-సెట్

===================

అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించానున్నట్టు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈరోజు ఆయన కలెక్టరెట్ సమావేశం మందిరంలో రథసప్తమి ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే రథసప్తమి ఉత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, శోభ యాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయని, మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎద్దుల బండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు.

===================

విరామం

===================

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జిల్లాలో మత్స్యసంపదను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. పిఎంఎంఎస్‌పై (PMMSY) పథకం అమలుపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ, మత్స్యసంపద వృద్ధితో ప్రజలకు పోషకాహారం, ఎన్నో కుటుంబాలకు ఉపాధి చేకూరుతుందని చెప్పారు. ఈ పథకం కింద మహిళలకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. సుమారు 4వేల మంది మత్స్యకారులకు 9.84లక్షల రూపాయల సబ్సిడీ అందజేసేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు.

===================

సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర నూతన డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా తెలిపారు. ఈరోజు ఆయన నూతన డిజిపిగా భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొంటూ..

(వాయిస్..36 సెకన్లు)

===================

భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10వ తేదీ వరకు నామినేషన్ల సమర్పణ, 11న నామినేషన్ల పరిశీలన, 13న

నామినేషన్ల ఉపసంహరణ, అలాగే 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. 2024 డిసెంబర్ 30న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో శ్రీకాకుళం జిల్లా వరకు గాను 31 కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

===================

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పిలుపునిచ్చారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 'ప్రతిభకు ప్రేరణ' కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. వారికి అందుబాటులో ఉన్న అవకాశాలను అన్వేషించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

===================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వారం రోజుల్లో పున:ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో ఫ్లై ఓవర్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ కారణాలతో నిలిచిపోయిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణంలో జాప్యాన్ని అధిగమించి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సమగ్ర భూసేకరణ, ఫ్లైఓవర్ నిర్మాణ అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

===================
===================